''నేనింకా న్యూస్ పేపర్ తెప్పించడం లేదు. నాకు తెలియదు సుమా..కాని, సి.ఎం.గారు చెప్పింది అక్షరాలా నిజమే. మన పిల్లలతోబాటు చదువుకుని, విజ్ఞానవంతులు కావలసిన వయసులో, వారిచేత ఇంటిపని చేయించడం నేరమే కాదు, అమానుషం కూడా! మా ఇంట్లో పనిచేసేది మల్లికాదు. చంద్రమ్మనుకో. తనకేదైనా పని వున్నప్పుడు కూతురు మల్లిని ఇలా పంపుతూంటుంది. ఇకనుంచీ ఇలా కూడా పంపొద్దనీ, నేనే చేసుకుంటాను. ఒంటికి ఎక్సర్‌సైజ్ కూడాను. మల్లిచేత చేయించను. ఈ ఆలోచనే రాని నాకు బాగా గుర్తుచేసినందుకు థాంక్స్ సునీతా..''

''దానికేంలే. నీలోనూ మానవత్వం వుందని నిరూపించావ్. మరి నేను వెడతాను. వీలు చూసుకుని మా ఇంటికి రా. వచ్చేముందు ఫోన్ చేసి రావాలిసుమా! మరేంలేదు నేను ఒట్టి బద్దకిస్టుని. సహవాసదోషంతో మరింత పెరిగింది. మావారు రాజకీయ నాయకులు కదా..కాస్త ఇల్లు నీట్‌గా సర్దివుంచుదామని..'' అంటూ, ఫ్రెండ్‌కి గుడ్‌బై చెప్పి, ఇంటికెళ్ళిపోయింది సునీత.

చాలారోజుల తర్వాత ఏదో పనిబడి, సునీత ఇంటివైపు వెడుతూ, ఆమెని కూడా ఓసారి చూద్దామని వాళ్ళింటికెళ్ళింది. ఇంట్లో అడుగుపెట్టిన సులోచన ఎదురుగా కనిపించే దృశ్యం చూసి... అంతే షాక్‌తో బిగుసుకుపోయింది.

మీకు తెలిసిపోయింది కదూ, సునీత ఇంట్లో పని చేస్తున్నది మల్లి అని!

**-ఎ.అన్నపూర్ణ** (హైదరాబాద్)

# పొరపాటు

''చూడండి శంకరయ్యగారూ! నా ప్రయత్నం నేను చేశాను. అయినా మీ జబ్బేమిటో నాకు అంతు చిక్కడం లేదు. హైదరాబాదుకు వెళ్లండి. అక్కడ పేరు పొందిన డాక్టర్లు చాలామంది వున్నారు. మీ ఆరోగ్యం బాగవుతుంది. నా మాట వినండి'' నచ్చజెప్పాడు డాక్టరు చౌదరి.

శంకరయ్యది తుంగభద్ర నది ఒడ్డున వున్న చిన్న పల్లెటూరు. ఒక మోస్తరు రైతు. శంకరయ్యే కుటుంబానికి ఆధారం. ఈ మధ్యకాలంలో శంకరయ్య ఆరోగ్యం క్షీణిస్తోంది. చూడ్డానికి అన్ని విధాలా బాగానే కన్పిస్తాడు. కానీ ఏదో తెలియని నీరసం. ఏ పని చేతకాదు. టౌనులో మంచి డాక్టర్లకే చూపించాడు. ఎన్నో మందులు వాడాడు. అయినా ఫలితం కనిపించలేదు.

''నువ్వు పట్నమెళ్లి చూపించుకో అన్నా. ఇక్కడ అన్ని పనులు నేను చూసుకుంటాగా. నీవేం మాపై దిగులుంచుకోవద్దు. ముందుగా నీ ఆరోగ్యం చక్కబడాల'' అన్నాడు పెద్దతమ్ముడు వీరయ్య.

''నిజమే. నేను బాగుంటేనే కదా నా కుటుంబం బాగుండేది. అందరూ ఇదే సలహా ఇస్తున్నారు. వానలు పడేలోగా వెళ్లొస్తేనే మంచిది'' నిర్ణయించుకున్నాడు. డాక్టరు చౌదరితో అన్ని విషయాలు రాయించుకొని హైదరాబాద్‌కు బయలుదేరాడు శంకరయ్య.

''ఒక్కరోజులో మెడికల్ రిపోర్టులన్నీ వచ్చేస్తాయి. నువ్వే తీసుకున్నా సరే. లేదా అడ్రస్ ఇచ్చి వెళ్తే అన్నీ పరిశీలించి వివరాలన్నీ మీకు తెలుపుతాం'' అన్నాడు డాక్టరు.

''ఊరికిపోయి మరలా రావడం దండగ. ఒక్కరోజు ఇక్కడే వుండి అన్ని విషయాలు తెలుసుకొని పోవడం మేలు'' అనుకున్నాడు శంకరయ్య. పక్కనే లాడ్జిలో బస చేశాడు.

శంకరయ్య హైదరాబాద్ చేరిన నాటినుండే వాతావరణంలో మార్పు వచ్చింది. బంగాళాఖాతంలో అల్పపీడనం. రాయలసీమ కోస్తా, ఆంధ్రాలో భారీ వర్షాలు రావచ్చునని టీవీ వార్తలు విన్నాడు. పేపర్‌లోను చదివాడు శంకరయ్య.

''వానలే లేవు. అల్పపీడనం ప్రభావం వల్లనైనా వానలు కురిస్తే చాలు. రాయలసీమలో రైతు బతుకు ఏటా ఒక గండంగానే గడిచిపోతుంది. అతివృష్టి, అనావృష్టి ఏదో ఒకటి తప్పదు. ఈ బతుకులు బాగుపడేదెప్పుడో'' నిట్టూర్చాడు శంకరయ్య.

''రాయలసీమలో భారీవర్షాలు'' పేపర్‌లో పెద్దక్షరాలు కనిపిస్తున్నాయి. పేపర్ కొన్నాడు శంకరయ్య.

''రాయలసీమలో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం. తుంగభద్ర డ్యాం గేట్లు ఎత్తి నీటిని నదిలోకి వదలడంతో వరదనీరు తోడై తుంగభద్ర నది ఒడ్డున వున్న వంద గ్రామాలు కనబడకుండా పోయాయి'' స్పష్టంగా వుంది పేపర్లో.

''వంద గ్రామాలు తుడుచుకుపోయాయంటే మా వూరెప్పుడో కొట్టుకుపోయి వుంటుంది. అయ్యో! ఎంత పని జరిగింది దేవుడా'' అంటూ కుప్పకూలిపోయాడు శంకరయ్య.

హాస్పిటల్ పక్కనే కావడంతో అక్కడున్న వారే శంకరయ్యను హాస్పిటల్‌లో చేర్చారు. ''అరే! ఇతడు నిన్ననే మెడికల్ చెకప్ చేయించుకున్నాడు. ఇంతలో ఏం జరిగిందో'' శంకరయ్యను పరీక్ష చేసిన డాక్టరు అక్కడే వుండడంతో శంకరయ్య అడ్రసు సులభంగానే తెలిసింది. ఇంటికి టెలిగ్రాం ఇచ్చారు.

మరునాటికి స్పృహలోకి వచ్చాడు శంకరయ్య. తల్లిదండ్రులు, భార్య, తమ్ముళ్లు తన చుట్టూ అంతా తనవారే.

'ఇది కల కాదు కదా. లేక నేను కూడా చనిపోయి నా వాళ్లందరిని స్వర్గంలో కలుసుకున్నానా. ఆ దేవుడే అందరినీ నా దగ్గరకు పంపాడా' చిత్రంగా అందరివైపు చూడసాగాడు శంకరయ్య.

''అదేమిటండీ అలా చూస్తున్నారు. నేను మీ భార్య లక్ష్మినండి. మీకేం కాలేదు'' అంటూ భర్త చేయి పట్టుకుంది లక్ష్మి.

'నిజమే నాకేం కాలేదు. నా వాళ్లందరూ బతికే వున్నారు' నమ్మకం కుదిరింది శంకరయ్యకు. ''లక్ష్మీ! మీరంతా బాగున్నారా. మన వూరికేం కాలేదు కదా'' ఆత్రంగా అడిగాడు శంకరయ్య.

''మీరేం మాట్లాడుతున్నారో మాకర్థం కావడం లేదు. అసలేమయింది మీకు'' గాభరాగా అడిగింది భార్య.

''అది కాదు లక్ష్మీ! నిన్న తుంగభద్ర నది ఒడ్డున వున్న వంద గ్రామాలు కొట్టుకుపోయాయని పేపర్లో..'' అంటూ నసిగాడు శంకరయ్య. ''అందుకేనా మహాప్రభూ తమరు పడిపోవడం. ఇదిగో ఈరోజు పేపర్లో ఏముందో చూడండి'' అంటు పేపర్ చేతికందించింది భార్య.

''నిన్నటి పేపర్లో తుంగభద్ర నది ఒడ్డున వున్న వంద గ్రామాలు నీట మునిగినట్లుగా పొరపాటున ప్రకటించాం. వంద గ్రామాలకు బదులు వంద ఇళ్లు అని చదువుకోగలరు. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాం' సవరణ అనే హెడ్డింగ్‌తో ప్రత్యేకంగా బాక్స్ కట్టి ప్రచురించారు.

''ఔరా! చిన్న పొరపాటు వల్ల ఎంత పని జరిగింది. అదృష్టం బాగుండి ప్రాణాలతో బయటపడ్డాడు కానీ లేకుంటే పాపం..'' విషయం విన్న అందరూ ముక్కున వేలేసుకున్నారు ఆశ్చర్యంగా.

''శంకరయ్యగారూ మీకో గుడ్‌న్యూస్. మీకే జబ్బులేదు. నెర్వస్ సిస్టంలో మైనర్ ప్రాబ్లం. దాన్ని తెలుసుకోలేక అక్కడి డాక్టర్లంతా మిమ్మల్ని ఇబ్బంది పెట్టారు. ఈ మందులు వాడండి చాలు. మీకే సమస్య రాదు'' అన్నాడు నవ్వుతూ డాక్టరు.

అంతా సంతోషంగా వూరు చేరారు.

**-టి.రామాంజనేయులు**
(హొలహర్వి)

★